


# నిప్పులేని పొగ

## ఆదూరి వెంకట సీతారామమూర్తి

"అయితే నేను చెప్పినట్లు చేయడానికి ఒప్పుకున్నట్లేగా?"

సుమిత్ర కంఠం ఖంగుమంది-ఆమె కళ్ళలో ఉత్సాహం ఉరకలు వేస్తూంది- ఫ్లాస్క్‌లోని కాఫీ కప్పులోనికి వొంపుకుని సిప్‌చేసి, కిటికీ దగ్గరకు వెళ్ళింది- మేశమించి కిటికీగుండా చూస్తే ఆకాశంలో నందకుమారుడిలా చంద్రుడు- చుట్టూ గోపికల్లా తెల్ల మేఘాలు - ఆ రాసకేళిలో తడుస్తూ క్రింద పచ్చటి పందిరి ఆ పందిరి - క్రింద విద్యుద్దీపాల వెలుగులో పెళ్ళిపీటల మీద పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ-

కిటికీలోంచి చల్లని గాలితో పాటు మంగళనాదం, సుగంధపరిమళమూ సుమిత్రను తోసుకు లోపలికి వచ్చాయి.

"ఏవిటి? మాట్లాడరేం-అయితే మీ యిద్దర్లోనూ ఎవరికీ నమ్మకాల్లేవన్న మాట" అంది తిరిగి.

అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటున్న అమృతం, పిల్లాడిని జో కొడుతూ వాడి ప్రక్కనే నడుం వాల్చిన

నిర్మల సుమిత్రవంక చూశారు-చూసి ఒకర్నొకరు చూసుకున్నారు.

"సరే-నేను రడీయే" అంది నిర్మల పిల్లాడిని తప్పించుకుని లేస్తూ-

"వెరీ నైస్. అలా వుండాలి ధైర్యమంటే" అని, తాగిన కప్పును ఓ మూలగా వుంచి నిర్మల లేచిన చోట్లోనే దిండు జరుపుకుని నడుం వాలుస్తూ "మరి నీ సంగతేమిటే?" అని అమృతం వంక చూసింది సుమిత్ర.

"అదే ఆలోచిస్తున్నాను-మా ఆయనేం నీ ప్రియుడిలా చదువుకున్నవాడూ, నిర్మల మొగుడిలా ఉద్యోగస్తుడూ కాదుగా – అయినా ఒక్కవిషయంలో అనుమానం..." అంటూ ఆగిపోయి, యిద్దరివంకా చూసింది అమృతం.

మోచేతులమీద తలనాన్చినదల్లా వెల్లకిలా పడుకుని, "యేవిఁటో చెప్పు-మీ యెవ్వరి సంసారాల్లోనూ నిప్పురాజుకోకుండా, ఏ అనుమానాలూ తలెత్తకుండా చూసే బాధ్యత నాది" అంది సుమిత్ర నిర్భయంగా.

"అదే నేనూ అనబోతున్నది – మగవాళ్ళతో సమానమంటూ యూనివర్సిటీ చదువు వెలగబెడుతున్నదానివీ, పెళ్ళి కానిదానివీ కాబట్టి నీకేం ఫర్వాలేదు-ఏపాటి తిరకాసైనా మా సంసారాల్లో గొడవలు తప్పవు. అయినాసరే ఒప్పుకొంటున్నాం-మా యిద్దర్లో ఎవరు గెల్చినా నువ్వు మా యింటికి యిట్నించిటే వచ్చి రెండురోజులుండాలి-ఇక నువ్వే గెల్చి మేం ఓడిపోతే యేంచేయాలో నువ్వే చెప్పు" అంది నిర్మల.

"యేముందీ – మీరెలాగూ నాతో రాలేరు గాబట్టి, మీరొచ్చినా హాస్టల్ వాళ్ళు వూరుకోరు గాబట్టి నా పెళ్ళి ఎక్కడ జరిగినా పదిరోజులు ముందుగానే మీరు మీ శ్రీవార్లతో వచ్చి తీరాలి, సరా."

"సరేగానీ ముందీ పెళ్ళి చూడనిస్తావా చూడనీయవా?" అంది అమృతం లేచి చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ.

"పెళ్ళి చూసేదేమిటే నీ బొంద-ఆ పురోహితు దేమంటున్నాడో మనకి అర్థంకాదు గదా – ఆ సన్నాయిమీద వాయించేది ఏ రాగమో, వాటి స్వరాలేమిటో అంతకంటే అయోమయంగదా-ఇక పుస్తెముడీ, జీలకర్రా బెల్లం, తలంబ్రాలూ, చుట్టుపక్కల వాళ్ళ నవ్వులూ – కొత్తవేమున్నాయి? అన్ని పెళ్ళిళ్ళూ యింతేగా!"

"అలా అయితే మనమెందుకు ఇక్కడకు రావటం? ముప్పూటలా తిని ఆడపెళ్ళివార్ని ఆర్పేందుకు కాకపోతే."

"అలా అన్నావ్, బాగుంది-పెళ్ళికి ఎంతోకొంత ఖర్చుపెడదామని ముందే అనుకుంటారు-కాబట్టి అది నువ్వు తిన్నా నేను తిన్నా పైన పారబోసుకున్నా ఒక్కటే-మనం తినకపోతే వాళ్ళకి మిగిలేదీ వుండదు-తిన్నందువల్ల తగిలిందీ

వుండదు-ఇక మనం ఎందుకొస్తామూ అంటే యిందుకే! నిజం చెప్పు- మన ముగ్గురిమీ కల్సుకుని ఎన్నాళ్ళయింది? మీ పెళ్ళిళ్ళకి శుభలేక ముక్క తప్ప స్వయంగా ఉత్తరమన్నా రాశారా? కాలేజీలో ఎలా వుండేవాళ్ళం ? మళ్ళీ యిన్నాళ్ళకిలా కల్సుకున్నాం - మరి పెళ్ళిళ్ళకు రాకపోతే ఎలా?"

"ఇన్ని విమర్శలు చేస్తున్నావ్. మరి నీ పెళ్ళెలావుంటుందో అదీ చూస్తాంగా" అంది నిర్మల.

"ఎలా వుంటుంది-నీలాంటి స్నేహితురాళ్ళందరూ వస్తారు. సర్దాగా కబుర్లు చెప్పుకుంటాం-సిన్మాలు చూస్తాం. కాలక్షేపం చేస్తాం-ఆరోజు రిజిష్ట్రారాఫీసులో దండలు మార్చుకుంటాం-ప్రెజెంటేషన్లు పుచ్చుకుని టాటాలు చెప్పేస్తాం."

"నీ ప్లాను బాగానేవుందిగాని-ముందీ పెళ్ళి చూడకపోతే బాగుండదు. పద పద" లేచింది అమృతం.

## 2

ఐదు నిముషాల్లో ఉత్తరం రాయడం పూర్తి చేసింది సుమిత్ర - ఆమె కళ్ళు ఇప్పుడు సంతృప్తిగా మెరుస్తున్నాయి-

"భార్య యిష్టాయిష్టాలకు ఎంత విలువిచ్చే భర్తయినా కొన్ని కొన్ని సమయాల్లో అనుమానమనే రక్కసి వలలో పడి, 'నీవే నా సర్వస్వం, నీ స్వేచ్ఛే నా స్వేచ్ఛ' అంటూ కూడా స్త్రీని శాసించి తన అధికృతను నిరూపించుకోక మానడు." అంటుంది సుమిత్ర.

"స్త్రీ కూడా తనకున్న స్వేచ్ఛను దుర్వినియోగపరచకుండా వుంటే ఏ పురుషుడూ స్త్రీని అడ్డడు" అంటుంది నిర్మల.

"ఒక జీవితాన్ని పంచుకున్న దంపతులకు వేర్వేరుగా స్వేచ్ఛలెందుకు?" అంటుంది అమృతం.

ఎంత చర్చించినా తన వాదమే నిజమంటుంది సుమిత్ర-చివరకు పందాల వరకూ వచ్చింది-సుమిత్ర తెలివైనదీ చురుకైనదీ- ఒక చిన్న అబద్ధాన్ని సృష్టించి నిజానిజాల్ని బయటకు లాగటానికుద్యుక్తురాలైంది-

"నేను మావారికి ఉత్తరం రాశాను- ముందు నువ్వు నీ సుధాకర్ కేం రాశావో చూపించు" అంది నిర్మల కవరుమీద ఎడ్రసు రాస్తూ

"ఏముందీ మీలా మాకు నమస్కారాలూ, ముద్దులూ వుండవుగా. చూడు" అంటూ ఉత్తరాన్నందించి అమృతం వంక చూసింది సుమిత్ర-తాపీగా ఆలోచిస్తూ ఉత్తరం రాస్తోంది అమృతం.

"ఏవిఁటే బాబూ-మీ ఆయనకి ఆవకాయ పాళ్ళూ, ఆరోగ్య సూత్రాలూ రాస్తున్నావా యేమిటి ఖర్మ-అబద్ధం అని తెలియకుండా నాలుగు ముక్కలు రాసి యిలా పడెయ్యి" అంది.

"అయిపోయిందయిపోయింది - ఉత్త

రంలో మా అత్తగార్ని అడిగినట్టు రాయకపోతే ఆవిడూరుకోదు," అంటూ ఉత్తరాన్ని పూర్తి చేసి అందించింది అమృతం.

ప్రతి ఒక్కరూ ముగ్గురు రాసిన ఉత్తరాలూ చదివాకనే పోస్టుచేసి జవాబుల కోసం ఎదురుచూడసాగారు.

3

మూడోనాటి మధ్యాహ్నానికి నిర్మలకు వాళ్ళాయన దగ్గరనుండి ఉత్తర మొచ్చింది-

"నీ పాత స్నేహితుడు అనుకోకుండా పెళ్ళిలో కలిసి తన యింటికి రమ్మని బలవంతం చేస్తున్నాడు అని రాశావు-నిజంగా చాలా సంతోషమే-జీవితంలో పాత కొత్త లెరుగనిది స్నేహమొక్కటే-ఆయన నువ్వన్నట్లు భావుకుడు, మంచివాడూ కావచ్చు. కాని స్త్రీ పురుషుల మధ్య నిజమైన స్నేహం ఎప్పుడోగాని నిరూపితమవదు-ఆయన వివాహితుడే అని రాశావు. అంతా మన లాగే వుంటారని ఎప్పుడూ అనుకోకూడదు - ఈపాటికి నే చెప్పేదేమిటో గ్రహించేవుంటావు. స్త్రీ కి స్త్రీయే శత్రువు-కాబట్టి నువ్వు వెళ్ళకపోవడమే శ్రేయస్కరం."

-ఇదీ ఆ వుత్తరంయొక్క సారాంశం. నిర్మల ముఖం చిన్నబోయింది.

"అమ్మో. మీ ఆయన తెలివైన వాడేనేవ్-తన అయిష్టత సూటిగా చెప్పడం యిష్టంలేక వాళ్ళ సంసారంలో గొడవలేమన్నా వస్తాయని వెళ్ళొద్దన్నాడు - ఏది ఏమైనా నీకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఇక ఈవిడగారి కేమని వస్తుందో చూడాలి" అంటూ అమృతం వంక సూసింది సుమిత్ర.

"మా వారి అభిప్రాయం మాటెలా వున్నా ఆయనకు ఉత్తరం రాయడమంటేనే బద్ధకం-నా కుత్తరం రాదు చూడండి" అంది అమృతం.

"నోనో-అదేం కుదరదు-ఉత్తరం రాకపోతే మీ ఆయన కిష్టం లేనట్టేలెక్క - రేపు సాయంత్రానికల్లా ఉత్తరాలు వచ్చి తీరాలి" నిష్కర్షగా చెప్పింది సుమిత్ర.

"నేను ముందే చెప్పాను - ఆపై నీ యిష్టం" అంది అమృతం నవ్వుతూ.

ఆ మర్నాడు మధ్యాహ్నం సుమిత్రకు సుధాకర్ దగ్గరనుండి ఉత్తర మొచ్చింది. అందులో మూడే మూడుముక్కలున్నాయి.

"నువ్వు నిజంగా వెళ్ళాలనుకున్నప్పుడు నా అనుజ్ఞ దేనికి సుమిత్రా - నీ యిష్టం"

ఎగిరి గంతేసింది సుమిత్ర.

"ఇప్పుడన్నా తెల్సిందా మగవాడంటే ఎలా ఉండాలో-" స్త్రీకి స్వేచ్ఛ యిస్తే ఏమైపోతుందోనని భయపడి పెళ్ళాన్ని తమ చెప్పుచేతల్లో వుంచుకుంటూ, తమకూడానే తిప్పుకునే మగాళ్ళంటే నా కెప్పుడూ మంచి అభిప్రాయంలేదు-అందుకే అన్నారు 'పురుషులలోన పుణ్య పురుషులు వేరయా...' అని."

"అవునవును - అది అన్నవాళ్ళే ఆడదానికి స్వేచ్ఛ పెళ్ళయ్యేవరకే అని కూడా అన్నారు" అంది నిర్మల కోపంగా.

"పోనీలేవే నువ్వే గెలిచావు. ఒప్పుకుంటున్నా సరా" అంది భర్తనుంచి ఉత్తరం రాని అమృతం-

"ఒప్పేసుకుంటే సరికాదు — నా పెళ్ళికి పదిరోజులు ముందుగా రావాలి తెల్సా-మీ వానపాముని కూడా తీసుకు రావాలి సుమా" అంది సుమిత్ర నవ్వుతూ -

## 4

"హలో సుమిత్రా - ఏమిటీ పెళ్ళి కెళ్ళి యిన్నాళ్ళుండిపోయావ్" అంది లావణ్య హాస్టల్లో అడుగు పెట్టగానే—

"ఎన్నాళ్ళకో ... మూణ్ణాళ్ళకో దీన్ని వుండమని వుంటారు." జోకే సింది సౌజన్య.

గొల్లుమన్నారంతా.

"సంతోషించాంగాని నా కోసం ఎవరన్నా వచ్చారా" రూంలోకి వెళ్ళ బోతూ అడిగింది.

"ఎవరో ... వస్తారని ... ఏదో యిస్తారని ఎదురుచూసి మోసపోకుమా"

పాట నందుకుంది రత్నమాల.

స్నానం చేసి డ్రస్ మార్చుకునే సరికి రాధ వచ్చింది -

"యేదో కారణముండే వుండాలి నువ్వినాళ్ళున్నావంటే" అంటూ—

"యేంలేదే-చిన్న పందెం కాసేను" అంటూ వివరంగా చెప్పింది సుమిత్ర -

"మొత్తానికి గెల్చావ్" అని, 'అన్నట్టు మొన్న మీ సుధాకర్ వచ్చా డోయ్-నువ్వు లేవంటే ఓ కవరు యిచ్చి వెళ్ళాడు" అంటూ లేచి పెట్టెలోనించి కవరుతీసి అందించిండి-ఆత్రంగా కవరు చింపి చదవటం మొదలుపెట్టింది సుమిత్ర—

మనిషికి అన్నపానీయా లెంత ముఖ్యమో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ అంతే ముఖ్యం. కాదనను-కానీ మన మేర్పరుచుకున్న యీ సంఘనియమాలు, సాంఘిక నీతులూ, సాంప్రదాయాలూ స్త్రీకి కొన్ని విలువల్ని ఆపాదించడం కోసం కొన్ని కట్టుబాట్లను కూడా ఏర్పర చాయి. వీటన్నిటినీ ఎందుకు ఏకరువు పెడ్తున్నానో నీకు తెల్సు-నా గౌరవం నిలిపేందుకే నువ్వు నా పర్మిషన్ అడిగావని నీ వుత్తరం చూస్తేనే అర్థ మైంది-సంతృప్తికరంగాలేని నా సమా ధానాన్ని చూసైనా నువ్వు నీ ప్రయా ణాన్ని మానుకుంటావని ఆశపడ్డాను.

నా పిరికితనానికి నువ్వేమనుకున్నా ఫరవాలేదు—కానీ ఒక్కమాట! - నువ్వీ కుటుంబంలో యిమడలేవు-పెళ్ళి చేసు కుని నీ జీవితాన్ని తెలిసీ నరకం చేయలేను. అందుకే మా నాన్నగారి ఆజ్ఞమేరకు మామయ్య కూతురు రేఖను నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను.

నన్ను క్షమించు.

— సుధాకర్